క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి చెక్కు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తూ ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయురాలు సూర్యదేవర రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఆ పాఠశాల విద్యార్థి ఆలపాటి సాయి గణేష్‌కు చదువు నిమిత్తం సోమవారం ఉదయం ఆమె భర్త యార్లగడ్డ జగదీశ్వరరావు రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. చెక్కును డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎంఈఓ దేవినేని వెంకట రమణ చేతుల మీదుగా అందజేశారు. కొమ్మోజు శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కుంగ్ ఫు మాస్టర్ రాఘవ, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆక్స్‌ఫర్డ్ ఫ్యామిలీ డే



విద్యార్థికి చెక్కు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతి నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ 26వ ఫ్యామిలీ డే సెలబ్రేషన్స్‌ను ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎస్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్లు విజయ భాస్కర్ రెడ్డి, జోసఫ్ రెడ్డి, ఆర్‌ఐ ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత – సాంస్కృతిక సమాహారాన్ని పురిగొల్పడమే నిజమైన విద్య అని అన్నారు. ఆక్స్‌ఫర్డ్ అంటే ఆంగ్లం – అద్భుతం దేశ సమగ్రతల సమాహారం అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, న్యూరాలజిస్ట్ వీవీ స్వరూప్, ఎస్‌వీఆర్ గాంధీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

డాక్టర్స్ కపుల్స్ లయన్స్ క్లబ్ ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు డాక్టర్స్ కపుల్స్ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. నగరంలోని ఒక కంటి ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ.. ప్రజాధనం వృథా

- నగరంలో ఎండిపోయిన మొక్కలు
- ధ్వంసమైన గ్రీన్ గ్రిల్స్

ఏలూరు (టూటౌన్): నగరంలోని సీఆర్‌ఆర్ కాలేజీ పొడవునా రోడ్డుకు ఇరువైపులా సుమారు రూ.50 లక్షలు ఖర్చుచేసి సుందరీకరణ చేశారు. చేసిన పనుల పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో వాటి రూపురేఖలు కూడా ఇప్పుడు కనిపించడంలేదు. నాటిన మొక్కలు ఎండిపోయాయి. పైపు లైను, గ్రీన్ మ్యాట్, ఫుట్ పాత్, వాకింగ్ ట్రాక్, స్ప్రింక్లర్స్ వంటివి పూర్తిగా ధ్వంసమై, వాటి ఆనవాళ్లే దర్శనమిస్తున్నాయి. ఈ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిరుపయోగంగా పనిముట్లు

ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీ వెంబడి బయట ప్రహరీ నుంచి రోడ్డుకు మధ్య నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. వీటి సంరక్షణ కోసం వేసిన గ్రీన్ గ్రిల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇదే ప్రాంతంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గృహ సముదాయం నుంచి కలెక్టరేట్ బంగ్లా, ఎస్పీ క్యాంపు ఆఫీసు, డీఐజీ బంగ్లా, సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ సెంటర్ వరకు దాదాపు కిలో మీటరుకు పైగా దూరం చేపట్టిన పలు సుందరీకరణ పనులు కానరావడం లేదు. జిల్లా జడ్జి బంగ్లా నుంచి డీఐజీ కార్యాలయం వరకు సుందరీకరణలో భాగంగా పలు చర్యలు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, గ్రీన్ మ్యాట్, పక్కగా పలు మొక్కలను నాటారు.



వృథాగా పడి ఉన్న స్ప్రింకర్స్



ఎండి పోయి, వాడిపోయిన మొక్కలు



సీఆర్‌ఆర్ కాలేజ్ ప్రహరీ వెంబడి ఎండిపోయిన మొక్కలు

వీటిని తడిపేందుకు మోటార్లు, పైపులైన్లు, స్ప్రింకర్లు వంటివి ఏర్పాటు చేశారు. నేడవి చాలావరకు కనిపించకుండా పోయాయి. మిగిలిన వాటిని పట్టించుకున్న నాథుడులేడు.

వృథా ఖర్చులను అరికట్టాలి



పట్టణ సుందరీకరణ పనులు బాగానే ఉన్నాయి. అవి నిర్వహణాలోపంతో వినియోగంలో లేకుండా పోతున్నాయి. దీంతో ప్రజా ధనం వృథాగా పోతుంది. వృథా ఖర్చులను అరికట్టాలి. ఈ నిధులతో మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు వంటి వాటికి వినియోగిస్తే బాగుంటుంది.

– కె.శ్రీనివాస్, సీపీఎం నాయకులు, ఏలూరు

నిర్వహణా లోపం



సుందరీకరణ, పచ్చదనం పేరుతో చేపట్టిన పనులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగానే ఖర్చు అవుతుంది. దీన్ని అరికట్టాలి. పనులు చేపట్టినా వాటిని నిరంతరం పర్యవేక్షించేలా సిబ్బందిని కేటాయిస్తేనే చేసిన పనులకు సార్థకత ఉంటుంది.

– బద్దా వెంకట్రావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, ఏలూరు

నీటి సమస్య రాకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : జిల్లాలో తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో తాగు, సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటికి సమస్య రాకుండా, కృష్ణా కెనాల్, పంటల కాల్వలలో తూడు తొలగించి సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని, శివారు ప్రాంతాలకు నీరు సరఫరా అయ్యేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మంచి నీటి చెరువులను కాల్వలు మూసివేసేలోగా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఇంజినీర్లు పి.సుబ్రహ్మణేశ్వరరావు, ఎస్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా



నగరపాలక సంస్థ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఏలూరు(టూటౌన్) : పురపాలక, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ, సిబ్బందికి ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే నేరుగా ఆయా సంస్థల ద్వారా జీతాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉద్యోగులు, సిబ్బంది ధర్నా చేశారు. కార్యాలయం మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఆప్కాస్‌ను రద్దుచేసి పాత కాంట్రాక్టు విధానాన్ని తీసుకొస్తే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఇబ్బందులు తప్పవన్నారు. ప్రభుత్వం సిబ్బంది పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు మద్దతుగా ఏఐటీయూసీ, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.కృష్ణమాచార్యులు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు బి.నాగేశ్వరరావు, మీసాల చంద్రమౌళి, బంగారు దుర్గాప్రసాద్, పుచ్చ శంకర్, జి.మల్లేశ్వరరావు, బి.నారాయణరావు, ఎస్‌ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వాహనంపై మెసెజ్ సెండ్ చేస్తూ..



చిన్నారితో ఉన్నా...



హైస్పీడ్ బైక్ చేతిలో ఫోన్



వెనుక మహిళా ఉన్నా..

వీరు మారేదెన్నడో !

వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని ఎంత అవగాహన కల్పించినా... ర్యాలీలు నిర్వహించినా... కొందరు యువకుల్లో మార్పు రావడంలేదనడానికి ఏలూరు నగరంలో సోమవారం కనిపించిన దృష్యాలే నిదర్శనం. వేగంగా వాహనం నడుపుతూ మెసెజ్‌లు చూసుకోవడం, వెనుక వైపు మహిళలు, చిన్నారులున్నా సెల్‌ఫోన్‌లో మాట్లాడడం పరిపాటిగా మారింది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	24	బీన్స్ చిక్కుడు	52
వంకాయలు (తెలుపు)	18	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	80
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	36	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	14	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	32	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-40	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా, మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం సామూహిక రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తొలుత స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం చేశారు. సాయంత్రం అనంతపురానికి చెందిన వాసుదేవశాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి కపిలేశ్వరపురానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణి త్యాగరాజ చరిత్ర అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు.

కొత్త వేతన ఒప్పందానికి సహకరించండి

ఏలూరు (టూటౌన్): మార్చి ఒకటి నుంచి అమలు చేయనున్న కొత్త వేతన ఒప్పందానికి పొగాకు వ్యాపారులు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏలూరు పట్టణ పొగాకు పనివార్ల సంఘం జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు బరగడ పోతురాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 28తో వేతన ఒప్పందం ముగుస్తుందని యూనియన్ గౌరవ సలహాదారులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరి 14, 20 తేదీల్లో వర్తకులు కార్మిక సంఘం నాయకుల మధ్య చర్చలు జరిగాయన్నారు. సమావేశంలో పొగాకు పని వారల సంఘం కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు, కోశాధికారి చింతపల్లి కుర్మా రావు, యూనియన్ నాయకులు శ్రీను, చిన్న, వెంకటేశ్వరరావు, కృష్ణ తదితరులు మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్, శర్వాణి స్కూల్ ఏరియా, 12 పంపుల సెంటర్, అలేఖ్యమ్మ గుడి ఏరియా, పెద్దింటి వారి వీధి, నూకాలమ్మ గుడి ఏరియా, తంగెళ్లమూడి బ్రిడ్జి ఏరియాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



జేపీని కలిసిన బుజ్జి తదితరులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి) సోమవారం జేపీని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్దల అభీష్టం మేరకు పార్టీ బలోపేతానికి పాటుపడతానని బుజ్జి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, రాష్ట్ర మైనార్టీ నాయకులు గాజుల బాజీ, గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు మద్దాల ఫణి, పలు యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చేనేతకు నిధులు కేటాయించాలి



జౌళిశాఖ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మిక సంఘ నాయకులు

ఏలూరు(టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం 2025 – 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకత్వం చేనేత, జౌళి శాఖ ఏడీకి వినతి పత్రం అందించారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కడుపు కన్నయ్య, జిల్లా నాయకులు యర్రా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేలు నుంచి రూ.36 వేలకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని మగ్గం ఉన్న వారితోపాటు చేనేతపై ఆధారపడి జీవించే ఉప వృత్తుల వారికీ అమలు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు రావాల్సిన రూ.172 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పండుగల సందర్భంగా జౌళి శాఖ ద్వారా 40 శాతం రిబేటును చేనేత వస్త్రాలకు ఇవ్వాలన్నారు.

పోలవరం కాలువ గట్టుపై కోళ్ల కళేబరాలు

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్ద గల పోలవరం కాలువ గట్టుపై సోమవారం వందలాది చనిపోయిన కోళ్లు దర్శనమిచ్చాయి. వాటిలో చాలా వరకు కాలువలో తేలియాడుతున్నాయి. కోళ్ల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు కలుషితమై పంట పొలాలకు చేరుతోందని రైతులు అంటున్నారు. భీమడోలు, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఏరియాల్లో తెలంగాణ, సత్తుపల్లి ప్రాంతాల నుంచి కోళ్లను వాహనాల్లో తీసుకుని వచ్చి హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల్లో బతికి ఉన్న కోళ్లను దుకాణాలకు అందించి, చనిపోయిన వాటిని ఇలా పోలవరం కాలువ గట్టుపై సోమవారం తెల్లవారుజామున పడేసి వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. దుకాణదారులు వినియోగం కోసం భారీగా కోళ్ల స్టాక్ తెచ్చుకోగా వాటిలో చనిపోయిన కోళ్లను కాలువ గట్టుపై వదిలేసి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై పోలసానిపల్లి, ఆంజనేయనగరం, పంగిడిగూడెం ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ఫౌల్ట్రీ అసోసియేషన్ వారు ప్రభావం లేదని చెబుతున్నా ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. సర్పంచ్ షేక్ రహీమాబేగం, గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ స్పందించారు. ఆ కోళ్లను బయటతీసి వాటిని గోతుల్లో పూడ్చే పనులు చేపట్టినట్లు వారు చెప్పారు.

త్రో బాల్ పోటీ విజేత కొప్పాక జట్టు

పెదవేగి : గ్రిగ్స్ ఆటల పోటీల్లో త్రో బాల్ బాల, బాలికల విభాగంలో తమ విద్యార్థులు సత్తాచాటి విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం ఆర్ శైలజ చెప్పారు. ఈనెల 22న కొవ్వలి హైస్కూల్లో నిర్వహించిన గ్రిగ్స్‌లో కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో విజయం సాధించిన పాఠశాల బాల బాలికలను పీడీ మోర్ల శ్రీనివాసరావును హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

నిరుద్యోగులను మోసగిస్తున్న ప్రభుత్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసగిస్తోందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, సీనియర్ న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు విమర్శించారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. తనను గెలిపిస్తే ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ఏలూరు (టూటౌన్) : పీడీఎఫ్ నుంచి ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కేఎస్ లక్ష్మణరావు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజవర్గానికి దిడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నారని, వీరిని గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. సోమవారం ఏలూరు అన్నే భవనంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు రైతులు, ప్రజా సంఘాల పోరాటాలకు మద్దతుగా శాసన మండలిలో సమస్యలు లెవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిధుల కోసం ఎంపీకి వినతి

ఏలూరు(టూటౌన్) : స్థానిక అమీనాపేట ఏటి గట్టు వద్ద నిర్మిస్తున్న మాలల కమ్యూనిటీ హాలుకు రూ.40 లక్షల నిధులు కేటాయించాలని కోరుతూ జేఏసీ నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు విచ్చేసిన సందర్భంగా బాబురావును నాయకులు కలిశారు. నిధులు లేక కమ్యూనిటీ హాలు మధ్యలో నిలిచిపోయిందని తెలిపారు. ఎంపీ నిధులు అందిస్తానని బాబురావు హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో జేఏసీ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, మెండెం సంతోష్ కుమార్, పల్లెం ప్రసాద్, ఎస్‌ఏడీ పాల్, కాటి అర్జునరావు తదితరులు ఉన్నారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

దెందులూరు: గ్రామాల్లో జ్వరాలపై సర్వే కొనసాగుతోందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది చేస్తున్న జ్వరాలపై సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వైద్య సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారికి తెలియజేయాలన్నారు. వైద్య సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు. ఎంపీహెచ్‌ఓ హరి, సిబ్బంది ఉన్నారు.